క్లుప్తంగా

ఘనంగా శ్రీనివాస కల్యాణం



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, భక్తులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు నగరంలోని పాతబస్తీలో ఉన్న శ్రీ పేట ఆంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 97వ సంవత్సర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం మధ్యాహ్నం బూరి బ్రాహ్మణ సంతర్పణం, రాత్రి దివ్య మంగళ రథోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీఎస్ రాధాకృష్ణ, అర్చకులు ముంజి రాఘవేంద్రప్రసాద్, ముంజి రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విజేతలను అభినందించిన డీఈఓ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు (టౌన్): ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో అండర్–17 విభాగంలో పాల్గొని పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ అభినందించారు. క్రీడాకారులు వెంకట శ్రీ దినేష్ –బంగారు పతకం, కంచి హవీష్, హేమంత్‌కుమార్ రెడ్డి – వెండి పతకాలు, బాలికల విభాగంలో యశ్మిత, గోపజ్ఞా –వెండిలు పతకాలు సాధించారు. వారికి మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఈఓ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి పరమేష్, శిక్షకులు జగదీష్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



పాస్టర్ శాంతిరాజుతో నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు, హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ డాక్టర్ శాంతిరాజు శాంతి సందేశం ఇచ్చారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ రామశివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో నిర్వహించే డిసెంబర్ 30, 31 తేదీల్లో నిర్వహించే ఏఐవైఎఫ్ 16వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వెంటనే 10 వేల మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమను స్థాపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు గ్రూపు పరీక్షలను నిర్వహించాలన్నారు. కానిస్టేబుల్ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో తీర్మాణాలు చేసి సాధన కోసం ఉద్యమ కార్యచరణను రూపొందిస్తామని ఆయన వివరించారు. నాయకులు రాజీవ్, రమేష్, శ్రీరాములు, సోమన్న, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సామీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అమ్మవారికి వడిబియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



తెల్లవారినా తొలగని మంచుతెరలు




చలిలో దుప్పట్లు కప్పుకుని వెళుతున్న ప్రజలు

నగరం గజ..గజ

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు అత్యల్ప స్థాయికి పడిపోవడంతో చల్లటి గాలులకు ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం 6 గంటలకే చలి ప్రభావం పెరగడంతో ఇళ్లకు చేరుకుని ముసుగు కప్పుకుంటున్నారు. ఉదయం 8 గంటలు దాటినా మంచుతెరలు తొలగిపోవడం లేదు. దీంతో తెల్లవారుజామున వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చలి తీవ్రతకు ఎక్కువ శాతం మంది ఇళ్లకే పరిమితం కాగా అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు గజగజ వణికిపోతున్నారు. నగరంలో, శివారు ప్రాంతాల్లో పలువురు తెల్లవారుజామున దుప్పట్లు కప్పుకొని, స్వెట్టర్లు వేసుకొని తలకు మంకీక్యాప్ ధరించి బయటకు వచ్చి తమ రోజువారీ పనులు చక్కబెట్టుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



దుప్పట్లు కప్పుకుని వెళుతున్న మహిళలు



నగర శివారులో కమ్ముకున్న పొగమంచు



చలిమంట కాచుకుంటున్న విద్యార్థినులు

సార్.. మా గోడు ఆలకించండి!

● 9వ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): ప్రభుత్వానికి మా గోడు పట్టదా? అని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విధులను బహిష్కరించి నగరపాలక సంస్థ ఎదుట చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో మరింత జాప్యం చేస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జ్ఞానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



మాట్లాడుతున్న టెలికం ఏజీఎం వి.శ్రీనునాయక్ తదితరులు



మాట్లాడుతున్న ఎం.యాకోబు



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అఖిల భారత బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కేంద్రీయ టెలిగ్రాఫ్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆహ్వానితులుగా టెలికం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.శ్రీనునాయక్ హాజరై విశ్రాంత ఉద్యోగులు వైసీహెచ్.ఎల్లయ్య, వైసీ రామయ్యను సన్మానించారు. విశ్రాంత జనరల్ మేనేజర్ పీఎస్. జాన్, విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ జాఫర్‌వలి, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.రామాంజనేయులు, కార్యదర్శి జె.వెంకటరమణ, అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి పి.రామదాస్ పాల్గొన్నారు.

పెన్షన్ల పేరివిజన్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): వేతన సవరణతో సంబంధం లేకుండా వెంటనే పెన్షన్ పేరివిజన్ చేయాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యాకోబు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడో పీఆర్‌సీ సిఫారసుల మేరకు 2017 నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలన్నారు. నాయకులు రామలింగం, విజయభాస్కర్ పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఆవరణలో ఉన్న జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో పింఛన్‌దారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం కార్యవర్గ సభ్యుడు డి.ఎస్.నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లయన్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సామాజిక సేవలు అందించిన విశ్రాంత ఉద్యోగులు ఎం.శంకరప్ప, ఎంఎల్ నరసయ్య, పి.తిరుపతి సాయి, కె.వెంకటస్వామి, బీమా ఎల్లాగౌడ్‌కు ప్రశంసా పత్రాలు ఇచ్చి సన్మానం చేశారు.


మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.20 వేలు జరిమానా



రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు: మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసు తనిఖీల్లో పట్టుబడితే నూతన చట్టం ప్రకారం రూ.20 వేలు జరిమానా విధిస్తామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ట్రాఫిక్ సీఐ ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియో చిత్రాలను ప్రదర్శించి బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు శోకాన్ని మిగల్చొద్దని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే రూ.వెయ్యి, మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు, ర్యాష్ డ్రైవింగ్‌కు రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సిందేనన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని, రోడ్డు ప్రమాదాలు ఎక్కడ జరిగినా, ఇబ్బందికరంగా వాహనాలు నడిపినా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్ఎస్ఐ హుసేన్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ చార్జీలను తగ్గించాలి



పూలబజార్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూల(సెంట్రల్): పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఆందోళన బాట పట్టింది. మంగళవారం 14, 15, 16 వార్డులలో ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారంపేటలోని భవానమ్మ గుడి ఎదుట నిరసన వ్యక్తం చేసి కరెంట్ బిల్లు ప్రతులను దహనం చేశారు. అలాగే పెద్దమార్కెట్ సమీపంలోని లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మండపం ఎదుట సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ఎండీ బాషా ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాతబస్టాండ్‌లోని పూలబజార్‌లో ఓల్డ్‌సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ట్రూ అప్ చార్జీలను పెంచకూడదని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు ఆధ్వర్యంలో నేతాజీ హౌసింగ్ కాలనీలో ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాజశేఖర్, అలివేలు మాట్లాడుతూ..అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచబోమన్న చంద్రబాబునాయుడు ఆరు నెలల్లోనే చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ఆరు నెలల పాలనలో ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం వేయడం సబబు కాదన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్‌లో ఆగి ఉన్న విద్యార్థుల ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన ఇద్దరు విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసపత్రిలో వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలన్నారు. గాయపడిన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలన్నారు. జాతీయ రహదారిలో సర్వీసు రోడ్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు సర్వీసు రోడ్లను నిర్మించకపోతే టోల్ గేట్లను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

జిల్లాలో 3 వేల టీచర్ పోస్టుల ఖాళీ

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో 3 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయని, డీఎస్సీ నియమాకాలు చేపట్టే వరకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, ఐ.మరియానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి వద్ద జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మంత్రిని కోరినట్లు వారు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరగా, మంత్రి స్పందించి పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయ రామరాజుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. డైరెక్టర్ సైతం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో మాట్లాడారని, రెండు రోజుల్లో నిర్ణయం చెబుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఏపీటీఏటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఏటీఏ) అడ్‌హక్ కమిటీ వైస్ చైర్మన్‌గా పలనాటి సునీల్ ఎన్నికయ్యారు. ఈయన కర్నూలు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీఓగా పనిచేస్తున్నారు. ఈ నెల 15న తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఏపీటీఏటీఏ ఏర్పాటైంది. ఈయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సంఘం నూతనంగా ఆవిర్భవించిందని, ఇందులో కిందిస్థాయి నుంచి గజిటెడ్ అధికారులు కూడా సభ్యులుగా ఉంటారని తెలిపారు. త్వరలోనే జిల్లా కార్యవర్గాలు కూడ ఏర్పాటవుతాయని ఆయన పేర్కొన్నారు.

నేడు క్యాండిల్ లైటింగ్ సర్వీస్

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక రాక్‌వుడ్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు క్రిస్మస్ క్యారెల్స్, క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్, క్రిస్మస్ కమిటీ కన్వీనర్ పి.ఆనందరావు, వైస్ చైర్మన్ ఎల్.వై.బెంజమెన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ డయాసిస్ బిషప్ ఎమెరిటస్ రెవ.డాక్టర్ బి.డి.ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై దైవ సందేశం ఇస్తారని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలని సూచించారు.

ఇళ్లను కూల్చాలన్న ఆలోచన విరమించుకోవాలి

కల్లూరు: హంద్రీ నది, వక్కెరవాగే వెంట ఉన్న పేదల గృహాలు కూల్చాలన్న ఆలోచన విరమించుకోవాలని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు కోరారు. ఈ మేరకు మంగళవారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వైద్యుల సర్దుబాటు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర వ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీల నుంచి కర్నూలు మెడికల్ కాలేజీకి పలువురు వైద్యులను సర్దుబాటు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణాలను నిలుపుదల చేసి అక్కడ పనిచేస్తున్న వైద్యులను ఇతర కాలేజీలకు బదిలీ చేశారు.

బదిలీ అయిన వైద్యుల వివరాలు

వైద్యుల పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్.కె.వాణిశ్రీ	ఆదోని	కేఎంసీ
వి.చంద్రమోహన్	ఆదోని	పాడేరు
ఎం. శ్రీనివాసనాయక్	ఆదోని	తిరుపతి
ఎల్.పార్వతి	ఆదోని	కేఎంసీ
సాయిక్రిష్ణ	ఆదోని	నంద్యాల
జి.జ్ఞానేంద్రప్రసాద్	ఆదోని	అనంతపురం
ఎస్.అనసూయ	ఆదోని	నంద్యాల
జి.సుజనాదేవి	ఆదోని	వైజాగ్
యు.శారద	ఆదోని	నంద్యాల
ఆర్.పావని	ఆదోని	రాజమహేంద్రవరం
అల్తాఫ్ హుసేన్ షేక్	పులివెందుల	కేఎంసీ
వి.ప్రసన్నరాణి	మార్కాపురం	కేఎంసీ
బిఆర్. చంద్రశేఖర్	పులివెందుల	నంద్యాల
సి.నాగశిరీష	మదనపల్లి	నంద్యాల
జి.కిరణ్మయి	మార్కాపురం	కేఎంసీ
జి.రజని	పులివెందుల	నంద్యాల
ఎం.రేవతి	మదనపల్లి	నంద్యాల
సి.అరుణ్‌కుమార్	మార్కాపురం	కేఎంసీ
ఎస్. అహ్మద్‌పీర	ఆదోని	కేఎంసీ
నజీహ నస్రీన్	ఆదోని	కేఎంసీ
కె.వీరసుధాకర్	ఆదోని	కేఎంసీ
డి.గీత	ఆదోని	అనంతపురం
ఏబీ.యశోదలక్ష్మి	ఆదోని	అనంతపురం
కె.చక్రపాణియాదవ్	ఆదోని	కేఎంసీ
ఆర్.తన్వి నిహారిక	ఆదోని	కేఎంసీ
టి. జగదీష్‌కుమార్	ఆదోని	అనంతపురం
జి.అనిత	ఆదోని	కేఎంసీ
కె.రాజ్‌కుమార్	ఆదోని	కేఎంసీ
ఎన్.శరత్‌చంద్ర	ఆదోని	కేఎంసీ
వై.సురేష్‌బాబు	ఆదోని	కేఎంసీ
టి. తులసిరాణి	ఆదోని	కేఎంసీ

23వ తేదీ వరకు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి గని సబ్‌స్టేషన్ వరకు 220 కేవీ విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నందున ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓర్వకల్లు పరిధిలోని కాల్వబుగ్గ అగ్రికల్చర్ కనెక్షన్లకు ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. రైతులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

కర్నూలు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, దివ్యాంగుల సంక్షేమం, లింగమార్పిడి, సీనియర్ సిటిజన్స్ కర్నూలు అసిస్టెంట్ డైరెక్టర్, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ సహాయ సహకారంతో కర్నూలులోని బాలుర దివ్యాంగుల వసతి గృహం, బి.క్యాంప్‌లోని దివ్యాంగ పిల్లలకు దుప్పట్లు, దిండ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగుల అవసరార్థం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సరైన రీతిలో ఉపయోగించి సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. మానసిక దివ్యాంగుల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం – 2005 గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం కోరేవారు లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100 ఉపయోగించుకోవలసిందిగా కోరారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు, కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ కె.గోవిందారెడ్డి, సంబంధిత శాఖల వారు పాల్గొన్నారు.

వాగు ఆక్రమణపై సర్వే

కర్నూలు(రూరల్): మండలంలోని నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని గార్గేయపురం చెరువు కింద వాగు వెంట భూముల ఆక్రమణలపై మంగళవారం డిస్ట్రిక్ సర్వేల్యాండ్ రికార్డ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునికన్నన్ పర్యవేక్షణలో అధికారులు సర్వే చేశారు. బత్తుల బిల్డర్స్ యాజమాన్యం ఆక్రమణలకు పాల్పడ్డారని ప్రజా సంఘాల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించినట్లు డిస్ట్రిక్ సర్వేల్యాండ్ రికార్డ్ శాఖ. అసిస్టేంటు డైరెక్టర్ మునికన్నన్ తెలిపారు. ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే నంబర్ 214, 215, 700, 701, 702లలో సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. పది రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు నివేదికలు సమర్పిస్తామని మునికన్నన్ తెలిపారు.

చంద్ర రాజకుమారికి నివాళి

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమాఖ్య పూర్వపు అధ్యక్షురాలు చంద్ర రాజకుమారి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని సీఆర్ భవన్‌లో నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం చంద్ర రాజకుమారి ఎంతో పోరాటం చేశారన్నారు. ఉమ్మడి ఏపీలో కల్తీ మద్యంపై అనేక పోరాటాలు చేసిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. నగర కార్యదర్శి భారతి, అంజలి, సుధాదేవి, శైలజ, పావని, ఆశాబేగం, కల్లూరు విజయ, నాగేశ్వరమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



నగరంలో సైక్లథాన్ ర్యాలీలో పాల్గొన్న సైక్లిస్టులు

కర్నూలు (టౌన్): పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వాములు కావాలని సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, కర్నూలు సాయ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా పేరుతో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి సైక్లాథాన్ ర్యాలీ నిర్వహించారు. ఆల్ ఇండియా పోలీసు రోయింగ్ పోటీల్లో మెడల్ సాధించిన చంద్రశేఖర్ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కర్నూలు ఔట్‌డోర్ స్టేడియం, పాత ఎస్పీ బంగ్లా, ఆర్ఎస్ రోడ్డు, కిడ్స్ వరల్డ్, పాత కంట్రోల్ రూమ్, కొండారెడ్డి బురుజు, వైఎస్సార్ సర్కిల్ మీదుగా స్టేడియం చేరుకుంది. ఈ సందర్భంగా సాయ్ సెంటర్ ఇన్‌చార్జ్‌తో పాటు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సైక్లథాన్ ర్యాలీ చేపడుతున్నారమన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా సైక్లింగ్ చేస్తే ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ సాధించవచ్చన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు రుద్ర రెడ్డి, తైక్వాండో శిక్షకులు కార్తికేయ, యూసుఫ్‌బాషా పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (టౌన్): పదే పదే చెబుతున్నాం. ఇంకెన్ని సార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించాలి. ఇప్పటికైనా అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నగర పాలక సంస్థ ఎదుట కాలనీవాసులతో కలిసి సీపీఎం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా పేదలు పోరంబోకు స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. లో ఓల్టేజీ సమస్య, అమృత్ పథకం కింద కుళాయిలు వేసినా నీళ్లు రావడం లేదన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సీపీఎం నాయకులు రాజశేఖర్, షానాజ్, లక్ష్మీదేవి, సరిత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.